# టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

**చేతులెత్తేసిన టీజీఐఐసీ**

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగు చూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

**స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ**

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.



# అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

## బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్

**60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.



# నూతన కార్ల సందడే..సందడి

**వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెలలోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

**కియా నుంచి రెండు మాడళ్లు**

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

**నిస్సాన్ మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్**

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

**బీవైడీ ఈమ్యాక్స్ 7**

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాస్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటీరియల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

**మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్**



జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

## ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.



# రియల్టీ సంస్థలపై రెరా కొరడా

**వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝులిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

**రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు**

| సంవత్సరం | ఫైన్ వేసిన ప్రాజెక్టులు | జరిమానా మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2018-19 | 335 | 3.06 |
| 2019-20 | 49 | 0.79 |
| 2020-21 | 04 | 0.29 |
| 2021-22 | 03 | 0.23 |
| 2022-23 | 180 | 1.70 |
| 2023-24 | 311 | 26.69 |
| 2024-25 | 131 | 2.96 |
| మొత్తం | 1013 | 35.72 |

**రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..**

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరి కొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.



మిర్చిచేనులో మల్చింగ్‌ను పరిశీలిస్తున్న డీడీఎం

## మిర్చి రైతులకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు

మంగపేట, సెప్టెంబర్ 28 : మిర్చి రైతుల కోసం అవసరమైన శిక్షణా సదస్సులతో పాటు విజ్ఞాన యాత్రలు ఏర్పాటు చేస్తామని జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (నాబార్డు) వరంగల్ క్లస్టర్ ములుగు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ తంగా రవి చైతన్య అన్నారు. మండలంలోని బోరునర్సాపురం, అకినేపల్లి మల్లారం గ్రామాలను ఆయన జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డితో కలిసి సందర్శించారు. బోరునర్సాపురం శివారులో సాగవుతున్న మిర్చి చేనులను పరిశీలించారు. వికాస్ అగ్రి ఫౌండేషన్ చైర్మన్, జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ సాంబశివరెడ్డి మాట్లాడుతూ మిర్చి రైతులకు శిక్షణతో పాటు రాయితీపై ఉపకరణాలు అందజేసేలా ప్రత్యేక ప్రాజెక్టు అమలు చేయాలని, మండలంలో 30 ఏళ్లుగా వరి విత్తనోత్పత్తి పెద్ద ఎత్తున చేస్తున్న నేపథ్యంలో నాబార్డ్ నుంచి ప్రత్యేక ప్రాజెక్టును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. డీడీఎం వెంట వన సమాఖ్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ జీ రమేశ్, వికాస్ అగ్రి ఫౌండేషన్ డైరెక్టర్లు నేలపట్ల వసంతరెడ్డి, చెట్టిపల్లి తిరుపతిరావు ఉన్నారు.

## వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 28 : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణకు అర్హత కలిగిన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు భూపాలపల్లి సింగరేణి ఏరియా అధికార ప్రతినిధి కే మారుతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ వర్క్స్, డీటీపీ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసైన మహిళలు అక్టోబర్ 7 లోపు ఏరియా పర్సనల్ విభాగంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



అంబేద్కర్ సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తీన్మార్ మల్లన్న టీం సభ్యులు

## రెడ్డి జాగృతి దిష్టిబొమ్మ దహనం

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 28 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా తీన్మార్ మల్లన్న టీం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో రెడ్డి జాగృతి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీం జిల్లా కన్వీనర్ రవి పటేల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై హైదరాబాద్‌లో రెడ్డి జాగృతి వాళ్లు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టినందుకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

**ములుగు, భూపాలపల్లిలో జాతీయ లోక్‌అదాలత్‌లు**

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 28 : రాజీ మార్గమే రాజా మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణ బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా సబ్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా నారాయణబాబు మాట్లాడుతూ ద్వేషభావాలను తగ్గించుకొని కేసుల్లో రాజీ మార్గాన్ని అలవాటు చేసుకోవాలన్నారు.జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారమయ్యాయన్నారు. అనంతరం జిల్లా ఓఎస్డీ బోనాల కిషన్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం అయితే ఇద్దరూ గెలుస్తారన్నారు. అనంతరం జిల్లా సబ్ కోర్టు ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి, సిబ్బంది కోర్ట్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే జయరాం రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ రామచంద్రా రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, బెంచ్ మెంబర్లు లతీఫ్, రజినీకాంత్, సంగెం రవీందర్, సుధారాణి, పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మలుగు రూరల్: మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ



కృష్ణకాలనీ : మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణరావు

**ములుగు జిల్లాలో 1,156 కేసుల పరిష్కారం**

ములుగురూరల్ : న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ములుగు కోర్టు ఆవరణలో నాలుగు బెంచీలను ఏర్పాటు చేసి 1,156 కేసులను పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకుంటే అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదని తెలిపారు. 17 రోడ్డు ప్రమాద కేసులను పరిష్కరించి బాధితులకు రూ.1,24కోట్ల పరిహారాన్ని అందించామన్నారు. 976 క్రిమినల్ కేసులు, 61ఎక్సైజ్ కేసులు, 90 సివిల్ కేసులు, 2 మెయింటనెన్స్ కేసులతో పాటు 10 బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జే సౌఖ్య, జూనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్‌కుమార్, కార్యదర్శి సునీల్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవికిరణ్, డీఎస్పీ రాములు తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా షాపులో చోరీ

తాడ్వాయి, సెప్టెంబర్ 28 : మండలంలోని కాటాపురంలోని తోలెం రామారావు కిరాణా షాపులో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి రామారావు షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగులగొట్టి, డోర్లు తీసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. కిరాణా సరుకులతో పాటు కొంత నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు.

## నిరుపేద విద్యార్థికి నగదు అందజేత

ఏటూరునాగారం, సెప్టెంబర్ 28 : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థిని పూల పల్లవికి బ్లడ్ డోనర్స్ గౌరవ సభ్యుడు బెల్లం శ్రీనివాస్ ద్వారా సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ రూ.5వేల నగదును శనివారం అందజేశారు. నిరుపేద విద్యార్థిని పల్లవిని చదువులో ప్రోత్సహించడానికి నగదు అందించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు, బ్లడ్ డోనర్స్ సలహాదారుడు ఖాజాపాషా మాట్లాడుతూ టెన్త్‌లో ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు తమ వంతుగా బహుమతులు అందజేస్తామన్నారు. మహ్మద్ మున్నా, మల్యాల పవన్, చామర్తి కిశోర్, రాజేందర్, రాకేశ్‌రెడ్డి, రాము, ప్రశాంత్, ప్రత్యేకాధికారి మడే అరుణ, రమాదేవి, శ్రీదేవి, స్వరూప, విజయ, వరలక్ష్మి, కౌసల్య పాల్గొన్నారు.

## ఘనంగా భగత్‌సింగ్ జయంతి

కృష్ణ కాలనీ/ఏటూరునాగారం, సెప్టెంబర్ 28 : భగత్ సింగ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సెంటర్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే, ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు శీలపాక హరీశ్, రమేశ్, మధు, శంకర్, శీను పాల్గొన్నారు. జనసేన పార్టీ జిల్లా నాయకుడు జేరిపోతుల సనత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు రాకేశ్, మధు పాల్గొన్నారు. కాగా, ఏటూరునాగారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రవితేజ పూలమాల వేసి నివాళులర్పించారు.

## ఆరోగ్య సూత్రాలను పాటించాలి : డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగురూరల్, సెప్టెంబర్ 28 : గుండెజబ్బులను నివారించేందుకు ప్రజలు ఆరోగ్య సూత్రాలను పాటించాలని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వైద్య సిబ్బందికి ములుగులోని కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలకు వైద్య సిబ్బంది ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు రణధీర్, పవన్, వైద్యాధికారులు ప్రసాద్, ప్రేమ్‌సింగ్, సిబ్బంది దుర్గారావు, పూర్ణ, సంపత్‌రావు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని ఇంచర్ల గిరిజన సంక్షేమ గురుకులంలో రాయినిగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించగా డీఎంహెచ్‌వో అప్పయ్య పాల్గొని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. మొత్తం 67 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఏడుగురు జ్వరంతో బాధపడుతుండగా వారికి డెంగ్యూ, ఆర్‌డీటీ పరీక్షలు చేసినట్లు తెలిపారు. శిబిరంలో వైద్యుడు ప్రేమ్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

## జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

కాటారం, సెప్టెంబర్ 28 : జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కాటారం గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 14 నుంచి 16 వరకు వరంగల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ చాంపియన్ షిప్ పోటీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు తరపున కాటారం గురుకులం విద్యార్థులు బీ అజయ్, చరణ్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీనితో అక్టోబర్ 2 నుంచి 6 వరకు హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, క్యాదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బాసరవేణ లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. కాగా, ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బీ లాలు, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఓటర్ల తుది జాబితా విడుదల

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 28: భూపాలపల్లి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. దీనిలో భాగంగానే జిల్లా పంచాయతీ అధికారి నారాయణ రావు శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 11 మండలాలు ఉండగా వాటిలో 240 గ్రామాలు, 2,044 వార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పురుష ఓటర్లు 1,42,217, మహిళా ఓటర్లు 1, 48,432, ఇతరులు 14 మంది కలిపి మొత్తం 2,90,663 ఓటర్లు ఉన్నారని డీపీవో తెలిపారు.

**గ్రామపంచాయతీల్లో జాబితా ప్రదర్శన**

కాటారం : మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఓటర్ల తుది జాబితాను శనివారం ప్రదర్శించారు. ఆయా కార్యదర్శులు ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రదర్శించారు. 24 గ్రామ పంచాయతీల్లో 210 వార్డులు ఉండగా పురుషులు 14,590, మహిళలు 15,498, ఇతరులు 9 మంది, మొత్తం 30,097 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి తెలిపారు.

## ఆపదలో ఆదుకోని 108 వాహనం

**తీవ్ర జ్వరంతో యువకుడి అవస్థలు**



జ్వరంతో బాధపడుతున్న గొనే కృష్ణమూర్తి

మహదేవపూర్, సెప్టెంబర్ 28 : అత్యవసర పరిస్థితిలో ఇంటి వద్ద నుంచి సమీప దవాఖానకు తీసుకెళ్లి సేవలందించేందుకు ఏర్పాటు చేసిన 108 వాహన సర్వీస్‌లు నిరుపేదలకు దక్కడం లేదు. మండల పరిధిలోని కిష్టరావుపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు గొనే కృష్ణమూర్తి వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. శనివారం జ్వరం మరింత తీవ్రం కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు 108కు కాల్ చేశారు. అయితే, సదరు సిబ్బంది అంబులెన్స్‌లు అన్ని బిజీగా ఉన్నాయని, ప్రస్తుతం పంపడం కుదరదని, ప్రైవేటు వాహనంలో తీసుకెళ్లాలని దురుసుగా ప్రవర్తించారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రైవేటు వాహనంలో తీసుకెళ్లే పరిస్థితి లేక మనోవేదనకు గురయ్యారు. ఆపదలో నిరుపేదలను ఆదుకోవాల్సిన 108 వాహనం సేవలు అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## పిచ్చికుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

వాజేడు, సెప్టెంబర్ 28 : పిచ్చికుక్కల దాడిలో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని జగన్నాథపురం, గణపురం గ్రామాల్లో చోటుచేసుకుంది. మండలంలోని ప్రగళ్లపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ ఖాసీం మహ్మద్ క్షవరం కోసం జగన్నాథపురం వెళ్లగా అక్కడ పిచ్చికుక్క కరిచింది. అలాగే, అరుణాచలపురం గ్రామానికి చెందిన సప్పిడి నాగరాజు సైతం గణపురం గ్రామానికి బైక్‌పై వెళ్లి వస్తుండగా పిచ్చికుక్క కరిచింది. గాయపడిన ఇద్దరు స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స తీసుకుని, మెరుగైన వైద్యం కోసం ఏటూర్‌నాగారం వైద్యశాలకు వెళ్లినట్లు తెలిసింది. రెండు నెలల్లో మండలంలో అయ్యవారిపేట, ధర్మవరం గ్రామాలతోపాటు వాజేడు, జగన్నాథపురం, గణపురం గ్రామాల్లో పలువురు పిచ్చికుక్కల దాడికి గురయ్యారు. దీంతో మండల వాసులు కుక్కల బెడదతో భయందోళన చెందుతున్నారు.

**రేబిస్‌పై ప్రజలకు అవగాహన**

మహదేవపూర్ : వరల్డ్ రేబిస్ డే సందర్భంగా మండల కేంద్రంలోని పశువైద్యశాలలో రేబిస్ వ్యాధిపై మండల పశు వైద్యుడు రాజబాపు శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్

## కమలాపురంలో రక్తదాన శిబిరం

మంగపేట, సెప్టెంబర్ 28 : మండలంలోని కమలాపురంలో జ్వాలా చారిటబుల్ ట్రస్టు-జన విజ్ఞానవేదిక జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు పాల్గొని రక్తదానం చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిబిరంలో 50 మంది రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జ్వాలా ట్రస్టు అధ్యక్షుడు కోడెల నరేశ్, జన విజ్ఞాన వేదిక ములుగు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గడ్డి శ్రీనివాస్, ట్రస్టు ప్రధాన కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక హెల్త్ కమిటీ కన్వీనర్ మునిగాల రాకేశ్, చెకుముకి కన్వీనర్ నాగేందర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా బాధ్యులు వెంకటస్వామి, గడ్డం శ్రీనివాస్, ట్రస్టు సభ్యులు ఇంతియాజ్, రోహిత్ పాల్గొన్నారు.